# సాక్షి

శ్రీరాజు



కాలేజీ మొత్తంమీద ఆ బేచ్ అంటే అందరికీ హడలే!

దానికి లీడర్ "హీమాన్."

అతని పేరు ఏదైనా, అతను పాప్యులర్ అయింది ఆ పేరుతోనే.

ఆడపిల్లల్ని ఏడిపిస్తారు. అలా యిలా కాదు, కళ్ళ నీళ్ళువచ్చి కాలేజీ మానే సేవరకు.

స్టాఫ్‌ని ఏడిపిస్తారు. అలా యిలా కాదు, రెండుచేతులు ఎత్తి దండం పెట్టేవరకు.

ఆడపిల్లలు ధైర్యంచేసి కంప్లెయింట్ చేసినా ప్రిన్సిపాల్‌కి ఏక్షన్ తీసుకొనే ధైర్యంలేదు. ఆ సంఘటనకి సాక్ష్యం వుందా అని అడుగుతాడతను. ఆ ముఠాకి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పే ధైర్యం పెద్దవాళ్ళలోను, చిన్నవాళ్ళలోను ఎవరికీ లేదు.

లెక్చెరర్సు విసుగెత్తి ఫిర్యాదు చేసినా, అతని బలాబలాలు బోధపరిచి, శాంతపరచి(!) పంపిచేంస్తారు ప్రిన్సిపాల్.

ఇలాంటి తన యిష్టా రాజ్యంలో,

ఆ రోజు వినోద కార్యక్రమంలో, 'హీమాన్', వంటరిగా వెళుతున్న సరోజ రెండు జడలలోను, ఒకటి కత్తిరించేసాడు తన అయిదుగురు స్నేహితుల సమక్షంలో,

సరోజ—

ఏడ్చుకొంది. ఏడుస్తూనే ప్రిన్సిపాల్ రూమ్ వైపు వెళ్ళింది.

బృందం—

ఆనందించింది. ఆనందంతో విరగబడి పైశాచిక నృత్యం చేసింది.

షరా మామూలే!

సాక్ష్యం లేవని 'ప్చ్' అన్నాడు ప్రిన్సిపాల్.

సరోజకి, కాలేజీ మానెయ్యటం మినహా మరొక గత్యంతరం కన్పించలేదు.

అయితే,

ఆడపిల్లల జట్టులో, కాస్త ధైర్యశాలి అయిన నీరజ యిక ఆగలేకపోయింది.

సరోజని తీసుకొని ప్రిన్సిపాల్ వద్దకు మరొకసారి వెళ్ళింది నీరజ.

"సాక్ష్యం లేకపోతే నేనేమీ చెయ్యలేనమ్మా" సహజ శాంత ధోరణిలో అన్నాడు ప్రిన్సిపాల్.

"ఇటువంటి వాటికి సాక్ష్యాలు దొరకవండీ. అయినా, అతని అత్యాచారాలు మీకు తెలియనివి కావు. మీరే పూనుకొని ఈ రాక్షసత్వానికి ఫుల్‌స్టాప్ పెట్టించకపోతే ఈ వ్యవస్థ దిక్కుమాలిపోతుంది."

పెదవి విరిచాడు ప్రిన్సిపాల్.

నీరజ కంఠశోష, వ్యర్థం అవుతోంది.

"మీ వ్యవహారం చూస్తూవుంటే, రేప్పొద్దున్న ఆ రౌడీ వెధవలు, కాలేజీ ఆడపిల్లని వంటరిగా, బలవంతంగా లాక్కుపోయి రేప్ చేస్తే, ఆ రేప్ సీనుకి కూడా సాక్ష్యం అడిగేటట్టున్నారు."

"అంతేకద మరి" అన్నట్టు చూసాడు ప్రిన్సిపాల్.

"యూ ఆరే ఫూల్....యూ....ఫిట్ ఫర్ నథింగ్ ఈడియట్" తీక్షణ్ణంగా చూస్తూ అని పళ్ళు కొరికింది నీరజ.

ఒక్కక్షణం, నీరజ ఏం మాట్లాడిందో బోధపడలేదు ప్రిన్సిపాల్‌కి.

ఆ ఒక్కక్షణం తర్వాత, ఆ తిట్లు తననే వుద్దేశించినవని గ్రహించాకా శాంతరసం రౌద్రంగా మారింది.

"షటప్! నిన్నీ క్షణంనించి కాలేజీలో నుండి డిస్మిస్ చేస్తున్నాను" దాదాపు అరిచాడు ప్రిన్సిపాల్.

"ఎందుకు సార్!" ఆశ్చర్యం నటిస్తూ అడిగింది నీరజ.

"యూ డేమ్ డర్టీగూస్....నన్ను ఫూల్, ఈడియట్ అంటూ తిడతావా?"

"ఛఛ....ఎంత మాటెంతమాట? నేనిప్పుడటువంటి మాటలే అనలేదే!"

ఈ సారి, రౌద్రం విస్మయంలోకి దిగింది.

"వాట్ డెవిల్ యూ ఆర్? ఇప్పుడిప్పుడు తిట్టి, మళ్ళీ అనలేదంటావా? ఏం సరోజా! నీరజ యిప్పుడు నన్ను తిట్టలేదూ?"

తెల్లమొహం వెయ్యబోతున్న సరోజవైపు తిరిగింది నీరజ.

"చెప్పు సరోజా! ఇక్కడున్న ఒకే ఒక సాక్ష్యానివి నువ్వు. అలాంటి మాటలన్నానా నేను!"

నీరజ స్ట్రాటెజీ కొంత అర్థమైనట్టే అనిపించింది సరోజకి.

"అబ్బే....అదేం లేదే....లేద్సార్" అంది సరోజ.

ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు ప్రిన్సిపాల్.

"మీరు నా మీద యాక్షన్ తీసుకోలేరు సార్. దీనికి....సాక్ష్యం లేదు."

శీతాకాలంలో వేసుకున్న సూటు వుక్కబోసింది, ప్రిన్సిపాల్‌కి.

"ఈ మాత్రం దానికే, నాలుగు గోడలమధ్య జరిగిన దానికే, యింత గిలగిలల్లాడిపోతున్నారే, రేపు....మీమీద తనకున్న అధిక్యత నిరూపించుకోవాలని వెర్రికోరిక ఆ రాక్షసుడికి కలిగితే, పదిమందిలోనూ మిమ్మల్ని అతను సాచిపెట్టి లెంపకాయ కొట్టినా ఆశ్చర్యపడనక్కరలేదు. అప్పుడు....ఒక్కడు...ఒక్కడు కూడా మీకు సాక్ష్యం రాలేడు. అప్పటి మీ పరిస్థితి వూహించుకోండి సార్.

"ఏక్షన్ తీసుకోకుండా తల ఎత్తుకొని తిరగగలరా? ఏక్షన్ తీసుకొని అమ్ముకొన్న తలని రక్షించుకోగలరా?"



ఒక్కక్షణం ఆగింది నీరజ.

"ఈ ఒక్కక్షణపు అవమానానికే మీరింత కుదేలయిపోయారే! అనుక్షణం అవమానాల పాలవుతూ ఎంతమంది నిస్సహాయంగా ఏడ్చుకొంటున్నారో గమనించండి. దీనికి అంతం లేనినాడు మీకు, మాకు, మన వ్యవస్థకి కూడా భద్రతలేదు. ఇది అంతం కావటానికి కావల్సింది సాక్ష్యం కాదు్సర్....కలేజా....గుండెధైర్యం! ఆ మొగతనం మీకు లేనినాడు...."

పూర్తిచెయ్యలేక ఆగి,

"గుడ్‌బై...." అంటూ సరోజ చెయ్యి పట్టుకొని వెళ్ళిపోయింది నీరజ.

"స్టాప్...." దావాపు మరోకసారి అరిచాడు ప్రిన్సిపాల్.

"అలా కూర్చోండి."

ఆడిపిల్లలిద్దరూ వెనక్కివచ్చి కూర్చున్నారు.

గ్లాసులో నీళ్ళు గటగట తాగేసాడు. టైనాప్ లూజ్ చేసుకొన్నాడు. తిరుగుతున్న ఫేన్‌వైపు తదేకంగా చూస్తూ కొంతసేపు ఆలోచించాడు.

చివరికి,

"సరోజూ, రేటింగ్‌లో కంప్లయింట్ యివ్వమ్మా" అని అడిగాడు.

సరోజ యిచ్చిన కంప్లయింట్‌పై ప్రిన్సిపాల్ ఎలా యాక్షన్ తీసుకోగలిగాడన్నది ముఖ్యం కాదు.

"భూమి ఆకాశం ఏకం చేసినా సరే, ఇక తమకి ఆ కాలేజీలోనే కాదు ఇక ఎక్కడా చదివే యోగం లేదని" ఆ బృందానికి తెల్సింది.

అంతకంటే ముఖ్యంగా,

"ధైర్యం వున్నవాడికి అసాధ్యం అన్నది లేదని....ధైర్యం లేనివాడు మనిషిగా మాత్రం బ్రతకలేడని" ప్రిన్సిపాల్‌కి తెల్సింది.

ఆ తర్వాత, ఆ కాలేజీలో, మనుషులు నిర్భయంగా మనుషుల్లాగ సంచరించేరు.